# అంబర వీధులు

రచన:
"తరణి"

"అది వినరా! యిదివినరా!
అందరు చెప్పిం దానవరా! నీ దారిన
నీవే సాగుమురా!"

ఈ పాట నొక వేశ్యచేత పాడిస్తాడో సినికవి. జీవితంలోని ఫిలాసఫీనంతా రెండే రెండు మాటల్లో తేల్చి పారేశాడు. 'జీవితం' అనే మాటకేమైనా అభ్యంతరాలుంటే, పోనీ 'బ్రతుకు' అందాం. ఏమైనా సాఫీగా, యేమీ గొడవలు లేకుండా బ్రతకాలంటే ఇది ఒక మంచిదారిలా కనిపిస్తుంది. చాలా మంది ఈ విధంగానే చేస్తూ వుంటారు గూడా! వీరిని దూషించే వారు తక్కువ. ఎందుకంటే ప్రతివారు చెప్పిందీ చాలా బుద్ధిమంతుల్లా వింటారు; అంతా ఒప్పుకొన్నట్లే కనిపిస్తారు. దీనితో ఆ చెప్పేవాడు తన భావాలకూ, తన నమ్మకాలకూ, వాటి బాలానికీ, మంచికీ ముగ్ధుడయిపోయి ఆ ఎదటి బుద్ధిమంతునిమీద బోలెడంత అభిమానం చూపించి తృప్తిపడతాడు; కాలరు సరిజేసుకొంటూ వెళ్తాడు. ఆ రెండో వ్యక్తి నవ్వుకొంటాడుగాబోలు- అతన్ని నమ్మించిన పద్ధతికి.

అసలు చాలా గొడవలకు కారణం-ఆచరణగాదు; మాటలేనేమో ననుకొంటాను. తాను మంచివనుకొని చేసే పనులు మరొకడు చేయక పోయినా ఫరవాలేదు గాని, చెడ్డవంటే మాత్రం చాలా కోపమొస్తుంది. దానితో ఎన్నో గొడవలు తలెత్తుతవి. తన దారి నడవని వానికన్నా అది మంచిదికాదన్నవాడు ఎక్కువ విరోధి అవుతున్నాడు. తెలివిగల వాళ్ళుగా, బ్రతుక నేర్చిన వాళ్ళుగా సాధారణంగా పరిగణింప బడుతున్నారు. వారు యిట్లాంటి గొడవలకు చాలా దూరం. అందరు చెప్పిందీ ఒప్పుకొన్నట్లు కనిపిస్తారు. కాని ఎన్ని దారులు ఎంతమంచిది చూపించినా తమదేదో తాము చూసుకుంటారు.

ఈ విషయాన్ని గురించే మాస్నేహితుడొకాయనతో మాట్లాడుతూ, ఇట్లాంటివారు తమ స్వంత అభిప్రాయాలమీద - యెవరెటు లాగుతున్నా - నిలబడటం చాలా గొప్ప సంగతి. పైకి వాగ్యుద్ధంచేయటమే గొప్ప అని అనుకోరు వారు. అన్నాను. ఆయనగారు నవ్వి, నీవేదో 'స్వంత అభిప్రాయాలూ,' నిలబడగలటం అని తెగ వాగేస్తున్నావు. అసలు వారికి కావల్సింది నీ అభిప్రాయాలూ గాదు; పాడూగాదు. కావల్సిందల్లా తమ పని సుళువుగా కావటం. దేనిలోనైనా వీలైనంత ఎక్కువగా లాభం పొందటం అన్నాడు. కాని నేను చెప్పిన లాంటి వ్యక్తులు గూడా వున్నారు - పల్చపల్చగానైనా వీరి నిగ్రహశక్తిని అపార్థం చేసుకోకుండా వుంటే వారిలోని మంచితనాన్ని గ్రహిస్తాం.

కాని కొంత మంది వుంటారు-యేమాత్రం ఆచరణ భేదంగాని, అభిప్రాయ భేదంగాని వస్తే సహించలేరు. తమ అభిప్రాయల్తో నిజంగా యేకీభవించని వారితో స్నేహం చేయటం వీరికి చాలా కషమైన పని. అందుకనే చాలా మంది స్నేహితులను వదులుకోవలసివస్తుంది. ఇట్లాంటి వారి స్నేహం సంపాదించుకోవలన్నా, దాన్ని నిలబెట్టుకోవాలన్నా కాస్త కష్టం. ఆలోచించి అర్థంజేసుకోవలసిన మనుషులు వీరు.

యేమైనా, "ఏరోటి దగ్గర ఆ పాటబాడటం, మనిషిని బట్టి మద్దెల వాయించటం" తెలివిగల పనులుగా, బ్రతుకనేర్చిన వారి విధులుగా కనపడుతున్నంయ్ ప్రస్తుతం.